క్లుప్తంగా

నేటి నుంచి నీటి సరఫరాకు అంతరాయం

ధారూరు: ధారూరు మండలంలోని 43 గ్రామాలు, తండాల్లో శుక్ర, ఆదివారం నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మిషన్ భగీరథ నీటి సరఫరా అధికారి ఒకరు తెలిపారు. రాఘవపూర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ పైప్‌లైన్ 1000 ఎంఎం డయామీటర్ పైప్‌లైన్ లీకేజీలను మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామాల ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

పత్తి కొనుగోలు కేంద్రం పరిశీలన



పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్: దౌల్తాబాద్ మండలం నీటూరు శివారులోని విజయా ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ విజయ్ కుమార్ గురువారం సందర్శించారు. పత్తి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయాలని కొనుగోలు దారులకు ఆయన సూచించారు. తేమ శాతం ఆధారంగా మద్దతు ధరను చెల్లించాలన్నారు. తూకంలో మోసం లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్‌తో పాటు ఏఓ లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా పాల్గొన్నారు.

అర్హులు ఓటు దరఖాస్తు చేసుకోవాలి



ఓటుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నేతలు

కుల్కచర్ల: అర్హులు ఓటు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల పరిధిలో సాల్వీడు గ్రామంలోని చెంచుకాలనీలో ఓటుహక్కు నమోదుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఓటు ప్రజాస్వామ్యంలో నిర్ణయాత్మక శక్తి అని పేర్కొన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభ, పీఏసీఎస్ డైరెక్టర్ కొండయ్య, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, గోపాల్, భరత్ కుమార్ రెడ్డి, హన్మంతు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మండల ప్రత్యేకాధికారి హన్మంతురావు



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హన్మంతురావు

దోమ: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మండల ప్రత్యేకాధికారి హన్మంతురావు తెలిపారు. గురువారం బొంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర సౌకర్యం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, ఎంపీఓ సోమలింగం, ఏపీఎం సురేశ్, పంచాయతీ కార్యదర్శి మీనా, సీసీ జంగయ్య, నర్సింహులు, మాజీ ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ సురేశ్, ఏఈఓ గణేశ్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, బషీర్, హైమద్, నర్సింహులు, చంద్రశేఖర్, రాములు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి సాయం

బొంరాస్‌పేట: ఇటీవల మృతి చెందిన మండల ఈనాడు దినపత్రిక జర్నలిస్టు ఉప్పరి వెంకటయ్య కుటుంబానికి రీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థికసాయం అందజేసింది. గురువారం ఆ సంస్థ డైరెక్టర్ వైజా సత్యభూపాల్‌రెడ్డి పంపించిన రూ.40వేలను సంస్థ ఉద్యోగులు నర్సింలు అందజేశారు. మూడున్నర దశాబ్దాలుగా రిపోర్టర్‌గా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భీంరెడ్డి, గోపాల్, చిన్నయ్య, మండల జర్నలిస్టులు అంజిలయ్య, నర్సింలు పాల్గొన్నారు.

తట్టెపల్లి బడికి దారేది?



తట్టెపల్లిలోని ఉన్నత పాఠశాల

ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు

- పాలకుల హామీలు బుట్టదాఖలు
- సమస్య పరిష్కరించాలని తల్లిదండ్రుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

పెద్దేముల్: కర్ణాటక-తెలంగాణ సరిహద్దుకు మూడు కిలోమీటర్ల దూరంలో తట్టెపల్లి గ్రామానికి కిలో మీటరు పరిధితో పాఠశాల ఉంది. ఈ పాఠశాల చుట్టుపచ్చని పంట పొలాలు, ఆహ్లాదకరమైన వాతావరణంతో ఎలాంటి అవంతరాలు లేకుండా చదువుకోవడానికి అనువైన ప్రాంతంగానే ఉంది. కానీ బడికి వెళ్లడానికి దారి లేక పొలంబాట నుంచి, చిన్నచిన్న కాలువలు, గట్లపైనుంచి వెళ్లాల్సి ఉంది. సుమారు పదేళ్లకు పైగా పంట పొలాల గుండా విద్యార్థులు తట్టెపల్లి పాఠశాలకు ఇబ్బందులు ఎదుర్కొంటూ వెళ్తున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. వర్షాకాలం ఇతర సమయాల్లో రాకపోకలు చేయాలంటే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దారి లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతి నిత్యం పంట పొలాల నుంచే బడికి వెళ్తున్నారు. పాఠశాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని విద్యార్థులు పలు మార్లు పాలకులకు, అధికారులకు విన్నవించిన ఫలితం లేదు. తాండూరు-జహీరాబాద్ ప్రధాన రహదారిపై తట్టెపల్లి చౌరస్తా వద్ద బైఠాయించి ధర్నాలు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. అప్పట్లో జిల్లా మంత్రులతో పాటు కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా షరమామూలుగానే ఉంది.

12 కిలోమీటర్ల దూరం..

మండల కేంద్రానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. అటవీ ప్రాంతంతో పాటు గిరిజన తండాలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో గురుకుల పాఠశాలలు లేక చాల మంది విద్యార్థులు ప్రాథమిక విద్యా తర్వాత బడికి దూరమయ్యేవారు. అలాంటి పరిస్థితి నుంచి తరగతుల వారీగా స్థాయి పెరిగి ఉన్నత పాఠశాలగా గుర్తింపు లభించింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఒకే చోటు ఉండడంతో గదులు సరిపడక పిల్లలు ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం అప్పట్లో 6నుంచి పదోతరగతికి కొత్త భవనం మంజూరు చేసింది. గ్రామానికి కిలోమీటరు దూరంలోని ప్రభుత్వ భూమిలో ఐదు ఎకరాల భూమి కేటాయించి పాఠశాల భవనాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలల్లో సుమారు 150 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని ప్రధానోపాధ్యాయుడు జోజప్ప తెలిపాడు. సుమారు పది సంవత్సరాలు దాటినా తమకు రహదారి సమస్య తీరటం లేదని, నిత్యం పంట పొలాల నుంచే బడికి వెళ్లాల్సి వస్తూందని పలు గ్రామాల విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో చర్చించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పట్టించుకున్న దాఖలాలు కూడా లేవు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి వెంటనే స్పందించి దారి సమస్య పరిష్కరించాలని తట్టెపల్లి ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.



కాలినడకన బడికి వస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఈ బడే దిక్కు

బండమీదిపల్లి, తట్టెపల్లి, జైరాం తండా, రచ్చకట్ట తండా, ఎర్రగోడు తండా, సిద్దన్న మడుగుతండా, పాషాపూర్, ఓంలానాయక్ తండాతో పాటు పలు గ్రామాల విద్యార్థులకు ఇది దగ్గరగా ఉండడంతో ఈ పాఠశాలలోనే విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఈ ప్రాంతంలో గిరిజన విద్యార్థులు అధికంగా ఉన్నప్పటికీ గిరిజన రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల లేదు. కాగా ఈ పాఠశాల చుట్టూ పట్టా భూములు ఉన్నాయి. వాటిలో రైతులు పంటలు సాగుచేసి జీవనం సాగిస్తుంటారు. పాఠశాలకు వెళ్లేందుకు పంట పొలాలు తప్ప మరో మార్గం లేదు. రైతు వేదిక పక్కనుంచి జిల్లా అధికారులు పాఠశాలకు మార్గం చేయించినప్పటికీ అది దూరంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థులు నిత్యం అష్టకష్టాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

భయంగా ఉంటుంది



పాఠశాల గ్రామానికి దూరంగా ఉంది. పాఠశాలకు ఒకరు వెళ్లాలంటే భయాంగా ఉంటుంది. మా గోడు ఎవరికి చెప్పిన లాభం లేదు. పాఠశాల వెళ్లడానికి దారి లేక వానకాలంలో బురదలోనే నడవాల్సి వస్తూంది. ఇక్కడ అన్ని వసతులు ఉన్నా పాఠశాలకు దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– ఐశ్వర్య, 10వ తరగతి, తట్టెపల్లి

సమస్య పరిష్కరించండి



తట్టెపల్లి ఉన్నత పాఠశాల దారి విషయంలో స్థానిక నాయకులు స్పందించాలి. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలి. ప్రతి ఏటా దారి సమస్యతో నానా ఇబ్బందులు పడుతున్నాం.

– ప్రశాంత్, 10వ తరగతి, తట్టెపల్లి

గుంపుగా వెళ్లాల్సిందే



పాఠశాలకు దారి లేక ఏటా విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పాలకులకు అధికారులకు విన్నవించినా లాభం లేదు. పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. భయాందోళనకు గురవుతున్నారు. ముగ్గురు, నలుగురు ఇలా గుంపుగా పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే పాలకులు స్పందించాలి.

– ఏసప్ప, రైతు, తట్టెపల్లి

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్

ధారూరు: ప్రతి సంవత్సరం ధారూరులో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఈ సంవత్సరం ఏర్పాటు చేయకపోవడంపై పలువురు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గురువారం మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధారూరు, హరిదాస్ పల్లి, అల్లిపూర్, చింతకుంట, స్టేషన్‌ధారూరు, అవుసుపల్లి, కుర్మింద, లక్ష్మీనగర్‌తండా, డీకేతండా, తిమ్మానగర్ తదితర గ్రామాల రైతులు తమ ధాన్యాని విక్రయించేవారు. ఈ సంవత్సరం జిల్లా, మండల స్థాయి అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల తాము ఇతర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వెళ్లలేకపోతున్నామని, దూరభారంతో పాటు వ్యయ ప్రయాసలకు గురి కావల్సి వస్తూందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ధారూరులో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని పీఏసీఎస్ అత్యవసర సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

శాసనసభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్తాం

ధారూరు మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు విషయమై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామని ధారూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్ పేర్కొన్నారు. గతంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన అధికారులు ఈ సంవత్సరం ఎందుకు తిరస్కరించారో అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి ధారూరులో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

వేరుశనగలో మెలకువలు పాటించాలి



దుద్యాల్: వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ తులసి

ఏడీఏ సౌభాగ్యలక్ష్మికుమారి

దోమ: రైతులు వేరుశనగ పంటలో మెలకువలు పాటించాలని ఏడీఏ సౌభాగ్యలక్ష్మికుమారి పేర్కొన్నారు. గురువారం అనంతరెడ్డిపల్లిలో రైతు రాజేందర్‌రెడ్డి పొలంలో వేరుశనగ పంటను పరిశీలించి లద్దె పురుగుపై విషపు ఎర తయారీ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేరుశనగ పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి పెరిగి ఆకులను తింటుందన్నారు. ఈ క్రమంలో రైతులకు దిగుబడిని తగ్గిస్తుందన్నారు. వాటి ఉధృతిని తగ్గించేందుకు ఎకరానికి 3కిలోల వరి తవుడు, 2కిలోల బెల్లం, ఒక లీటరు క్లోరోపైరిపాస్ లేదా లీటరు నీటిలో మోనోక్రోటోపాస్ కలిపి ఒక రోజు పులియబెట్టాలన్నారు. మరుసటిరోజు అట్టి మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేసి ఉదయం, సాయంత్రం వారానికి రెండు సార్లు చల్లుకుంటే లద్దె పురుగు ఉధృతి నివారించవచ్చన్నారు. మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, ఏఈఓ బాబ్యు నాయక్, రైతులు మహిపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మదుసూధన్‌రెడ్డి, పాల్గొన్నారు.



దోమ: అనంతరెడ్డిపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సౌభాగ్యలక్ష్మికుమారి

దుద్యాల్‌లో..

దుద్యాల్: వేరుశనగ పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవాలని వ్యవసాయ అధికారి తులసి సూచించారు. మండల పరిధిలోని హంసంపల్లి గ్రామంలో వేరుశనగ పంటను ఆమె పరిశీలించారు. మోతాదుకు మించి మందులు వాడొద్దన్నారు. పంటల పిచికారీ సమయంలో గ్రామాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్, రైతు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో నాయకులు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయ నిర్మాణానికి భూమిశుద్ధికి గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీసంగమేశ్వర భక్త సమాజం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రముఖ నాయకులు, మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలు, సంఘాల, నాయకులు, ఉద్యోగులు హాజరయ్యారు. ఉదయం 8గంటలకు భూమిశుద్ధి, హోమం, పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ నాయకులు విజయవర్ధన్, టి.లచ్చప్ప, జ్యోషి సత్యనారాయణ, నర్సింలుగౌడ్, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, నర్సింలు నాయుడు పాల్గొన్నారు.

వచ్చే నెల 2న బహిరంగ వేలం



అనంతగిరి: జిల్లాలో వివిధ కేసుల సందర్భంగా సీజ్ చేసిన పలు వాహనాలను డిసెంబర్ 2న బహిరంగ వేలం వేస్తున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి పి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల వల్ల సీజ్ చేసిన వాహనాలను విక్రయించనున్నట్లు ఆయన వెల్లడించారు. వేలంలో పాల్గొనే వారు దరఖాస్తుకు రూ.500లు, డిపాజిట్‌కు రూ.వెయ్యి నగదు చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలోని 9848528441 ఫోన్ నెబంర్‌పై సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డారు. పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, కౌన్సిలర్లు కిరణ్‌పటేల్, ప్రభావతి, డీఈ రాకేష్‌రెడ్డి, సదానందరెడ్డి, సురేష్‌గౌడ్, సర్వరాజు, ఆనంద్, జాకీర్, సిద్దిక్, ఇర్ఫాన్, హాజీపాషా, రజాక్, బాబ్జీ, ఉమాకాంత్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేతో పేదలకు మేలు



అనంతగిరి: సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ వినయ్‌కుమార్



కుల్కచర్ల: చౌడాపూర్ సర్వేలో కాంగ్రెస్ నేతలు



బొంరాస్‌పేట: సమగ్ర సర్వేపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

కుల్కచర్ల: సమగ్ర కుటుంబ సర్వేతో పేదలకు మేలు కలుగుతుందని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం చౌడాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వే తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే వల్ల ఏ కులంవారు ఎంత శాతంగా ఉన్నారు? వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు వంటి విషయాలు తెలుస్తాయన్నారు. సాయిలమ్మ, సలీం, మాసయ్య, యాదయ్య, ఎరుకలి యాదయ్య, కృష్ణ, అంజి, రత్‌కుమార్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన సోషల్ ఎకనామిక్ కులగణన సర్వేలో ప్రతిఒక్కరూ నమోదు చేయించుకోవాలని మండల కేంద్రంలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: వికారాబాద్‌లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీఓ వినయ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేపడుతున్న గుర్తింపు, స్టిక్కరింగ్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎంపీఓ దయానంద్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడలో జిమ్స్ ఆస్పత్రి, హోమియో కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రపంచ మధుమేహం వ్యాధి వారోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా మధుమేహంతో బాధపడే వారి కోసం వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిమ్స్ డాక్టర్ విరాజ్ హాజరై పలువురు వైద్య విద్యార్థులతో గ్రామస్తులకు మధుమేహం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విరాజ్ మాట్లాడుతూ.. రోగి ప్రీ డయాబెటిక్ దశలో ఉన్నట్లయితే ఏ విధంగా దానిని నివారించాలో, ఒక వేళ డయాబెటిక్ వ్యాధి ఉన్నట్లయితే ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం జిమ్స్ డాక్టర్ల బృందం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 60 మందికి పైగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్, డాక్టర్లు గీత, దివ్య, వైద్య విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

కేశంపేట: షెడ్యూల్ తెగల ఉపప్రణాళిక పథకంలో భాగంగా మండల పరిధిలోని గుట్టలగడ్డతండాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వారు గ్రామస్తులకు రైతులకు మొక్కజొన్న సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు మొక్కజొన్న సాగు పద్ధతులను వివరించారు. అనంతరం రైతులకు ఉచితంగా విత్తనాల ప్యాకెట్లతో పాటు కలుపు మందును అందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఎస్ఎల్ జూట్, డాక్టర్ నగేశ్‌కుమార్, సునీల్, మల్లయ్య, లక్ష్మి, సౌజ న్య, వాణి, పరమేశ్వరి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, రాజేశ్వరి, తదితరులుపాల్గొన్నారు.